క్లుప్తంగా

రైతులకు పంట రుణాలు ఇవ్వాలి



జనగామ రూరల్: స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రాతిపదికన బ్యాంకు డిపాజిట్ల నుంచి జిల్లాలోని రైతులందరికి పంట రుణాలు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ రిజ్వాన్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు మంగ బీరయ్య, బాణాత్ సురేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇంటి నంబర్లు ఇవ్వాలి

జనగామ రూరల్: పట్టణంలో 2012–13 సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం మూడో విడత పేదలకు ఇచ్చిన స్థలాల్లో నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లకు ఇంటి నంబర్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి కోరారు. ఈ మేరకు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్, బూడిది గోపి, భూక్యా చందు, కళ్యాణ లింగం, సుధాకర్ పాల్గొన్నారు.


నియామకం

స్టేషన్‌ఘన్‌పూర్: భారతీయ జనతా పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన మంద రాజేష్‌రెడ్డిని నియమించినట్లు మండల పార్టీ అధ్యక్షుడు సట్ల వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు రాజేష్‌రెడ్డి సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. బీజేపీలో తాను చేస్తున్న కృషిని గుర్తించి పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. పదవితో తన బాధ్యత మరింతగా పెరిగిందని, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ పటిష్టతకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. తనను పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా నియమించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్, మండల అధ్యక్షుడు సట్ల వెంకటరమణ, రాష్ట్ర నాయకులు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, బొజ్జపల్లి సుభాష్, వరంగల్ పార్లమెంట్ కోకన్వీనర్ ఇనుగాల యుగేందర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డితో పాటు జిల్లా, మండల నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి మృతి

బచ్చన్నపేట: మద్యానికి బానిసైన వ్యక్తి మృతి చెందిన సంఘటన కొడవటూర్ గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ తెలిపిన వివరాల ప్రకారం.. బోనకొల్లూర్ గ్రామానికి చెందిన బైర మహేష్ (33) జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం పనికి వెళ్తున్నానని చెప్పి సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. కాగా, సోమవారం ఉదయం కొడవటూర్ శివారులో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు కుటుంబ సభ్యులు వెళ్లి చూసి మహేష్‌గా గుర్తించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిడుగుపాటుతో ఎద్దు..



స్టేషన్‌ఘన్‌పూర్: తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన రాచర్ల రాజు అనే రైతు పదిరోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందగా అతనికి చెందిన ఎద్దు సోమవారం సాయంత్రం పిడుగుపాటుతో మృతిచెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తానేదార్‌పల్లికి చెందిన రాజు పదిరోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందగా సోమవారం వారి ఇంటివద్ద అతడి దశదినకర్మ కార్యక్రమం నిర్వహించారు. కాగా, సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురియగా వారి వ్యవసాయభూమి వద్ద కట్టేసి ఉన్న ఎద్దు ప్రమాదవశాత్తు పిడుగుపాటుకు గురైంది. గమనించిన చుట్టుపక్కల రైతులు రాజు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వెళ్లి చూసేసరికి ఎద్దు అక్కడికక్కడే మృతిచెందింది. దాదాపు రూ.70వేలు విలువైన ఎద్దు మృత్యువాత పడిందని, ప్రభుత్వం స్పందించి ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

దేవరుప్పుల: సహకార సంఘాల్లో 50 శాతం సబ్సిడీతో జీలుగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏఈఓ సూదగాని సాగర్ తెలిపారు. దేవరుప్పుల రైతు వేదిక పరిధి గ్రామాల రైతులు వచ్చి పర్మిట్ తీసుకుని వెళ్తే సహకార సంఘంలో 30 కిలోల బస్తాకు రూ. 4,275 కుగాను సగం శాతం సబ్సిడీతో రూ.2,137.50 చెల్లిస్తే జీలుగు విత్తనాలు ఇస్తారన్నారు. ఆసక్తి కలిగిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పుస్తకం జిరాక్సుతో రైతు వేదికలో సంప్రదించాలని సూచించారు.

‘ఉపాధి’కి సిబ్బంది కొరత

- 17 జీపీలకు 14 మంది మాత్రమే ఫీల్డ్ అసిస్టెంట్లు
- తగ్గుతున్న కూలీల సంఖ్య



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలతో అధికారులు (ఫైల్)

చిల్పూరు: నూతనంగా ఏర్పడిన చిల్పూరు మండలంలో 17 గ్రామ పంచాయతీలుండగా 14 మంది ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లు మాత్రమే ఉండడంతో ఉపాధి పనులు చేయించేందుకు సిబ్బందికి ఇబ్బందిగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంతో పాటు, వలసలు తగ్గిస్తూ కూలీలకు ఆర్థికంగా చేయూతనందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నూతనంగా మండలాలు, గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి నూతనంగా ఏర్పడిన మండలాలకు కూడా ఉమ్మడిగా ఉన్న గ్రామ పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించి ఉపాధిహామీ పథకాన్ని కొనసాగిస్తోంది. అయితే కొత్తగా ఏర్పాటు చేసిన పంచాయతీలకు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించక పోవడంతో పనులకు అనుగుణంగా ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో కూలీల సంఖ్య తగ్గుతోంది.

17 గ్రామాలకు 14 మంది మాత్రమే ఫీల్డ్ అసిస్టెంట్లు

మండలంలో 17జీపీలకు 14 మంది మాత్రమే ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. కొత్తగా ఏర్పడిన గార్లగడ్డతండాకు ఫత్తేపూర్, తీగలతండాకు రాజవరం, వెంకటేశ్వరపల్లికి వెంకటాద్రిపేట ఫీల్డ్ అసిస్టెంట్లకు అదనపు బాధ్యతలు అప్పగించారు. వీరు రోజు వారీగా ఉపాధి కూలీలకు పనికల్పించడం, మస్టర్లు తీయడం, జాబ్ కార్డులు మంజూరు చేయడం ఆధార్ నంబర్ అనుసంధానం, కూలీలకు వసతులు కల్పించడం తదితర పనుల తర్వాత ఫొటో క్యాప్చర్ చేయడం వంటి పనులు నిర్వహిస్తారు. ఇలా అన్ని పనులు అదనంగా వీరు చూసుకోవడం ఇబ్బందిగా మారుతోంది. ఇక ఇద్దరు మాత్రమే టెక్నికల్ అసిస్టెంట్లు ఉండడంతో పనుల కొలతల్లో జాప్యం జరుగుతోంది.

గ్రామానికో ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలి..



కూలీలకు సరైన న్యాయం జరగాలంటే గ్రామానికో ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలి. తమకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో కొంత ఇబ్బంది అవుతోంది.

\- శ్రవణ్‌నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్

ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవు..



కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవు. పర్యవేక్షణ ఇబ్బందిగా ఉన్నా చేయాల్సిందే. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

\- మోహన్‌రావు, ఏపీఓ, చిల్పూరు

నేటినుంచి హెచ్‌ఎంలు, ఎస్‌జీటీలకు శిక్షణ



శిక్షణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ కొమురయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: మండల స్థాయిలో ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలకు, ఎస్‌జీటీ టీచర్లకు ఈనెల 20 నుంచి 24వ తేదీవరకు ఐదురోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి కొమురయ్య తెలిపారు. ఈమేరకు శిక్షణ నిర్వహించనున్న శివునిపల్లి జెడ్పీఎస్ఎస్‌లో ఏర్పాట్లను హెచ్‌ఎం కుసుమ రమేష్‌తో కలిసి ఎంఈఓ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుదన్నారు. మండల పరిధిలోని ఐదుగురు ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలకు, 78 మంది ఎస్‌జీటీలకు శిక్షణ ఉంటుందన్నారు. జిల్లాస్థాయిలో శిక్షణ పొందిన 8 మంది ఎంఆర్‌పీల ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డిజిటల్ పాఠాలు, లెర్నింగ్ అవుట్ కమ్స్, లైఫ్‌స్కిల్ తదితర అంశాలపై శిక్షణ నిర్వహిస్తారన్నారు. శిక్షణకు ఎవ్వరూ గైర్హాజరుకావద్దని, ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది గిరి, లవన్‌కుమార్, మాషక్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీకే విత్తనాలు విక్రయించాలి

- స్టేషన్‌ఘన్‌పూర్ ఏడీఏ వసంత సుగుణ



విత్తన షాపులో తనిఖీ చేస్తున్న ఏడీఏ వసంత సుగుణ

రఘునాథపల్లి: ఫర్టిలైజర్, పెస్టిసైడ్ షాపు వ్యాపారులు రైతులకు ఎంఆర్‌పీ ధరలకే నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఏడీఏ వసంత సుగుణ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని మూడు విత్తనాలు, ఎరువుల షాపులను మండల వ్యవసాయాధికారి కాకి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. అయా షాపుల్లో లైసెన్స్, స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్ తదితర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ విత్తనాల కొనుగోలుకు సంబంధించిన రశీదులు తప్పనిసరి రైతులకు ఇవ్వాలని వ్యాపారులను ఆదేశించారు. నిబంధనల ప్రకారమే విత్తనాలు, ఎరువులు విక్రయించాలని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

పేదలకు కాంగ్రెస్ సర్కారు అండ



చెక్కులు పంపిణీ చేస్తున్న కిరణ్ కుమార్‌గౌడ్

జనగామ: నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం జనగామలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన అనంతరం కిరణ్ మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదలకు అండగా నిలుస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. నియోజకవర్గంలో అనారోగ్య ంతో బాధపడుతున్న అనేక మంది కుటుంబాలకు సీఎం సహాయ నిధి నుంచి సీఎంఆర్‌ఎఫ్ పేరిట రూ.కోట్ల సాయం అందిస్తున్నామన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారి వివరాలను స్థానిక నాయకత్వం ద్వారా తెలుసుకుని, సర్కారు నుంచి సాయం వచ్చేలా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మహేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దూడల సిద్ధయ్య, బచ్చన్నపేట మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, సర్వాల నర్సింగరావు, మధు, అంజయ్య, సత్యనారాయణరెడ్డి, మహేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎన్నిక



జువ్వాడి రమేశ్

జఫర్‌గఢ్: మగ్దుంతండా గ్రామ శివారు అవుసలితండాకు చెందిన జువారి రమేశ్ సీపీఐ మండల కార్యదర్శిగా రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప్పుగల్లులో నిర్వహించిన సీపీఐ మండల మహాసభలో పార్టీ మండల కార్యదర్శితో పాటు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందన్నారు. పార్టీ మండల కార్యదర్శిగా మరోసారి జువారి రమేశ్ ఎన్నిక కాగా పార్టీ మండల సహాయ కార్యదర్శిగా పెండ్యాల సమ్మయ్య, కమిటీ సభ్యులుగా ఎండీ యాకుబ్‌పాషా, మండల గట్టుమల్లు, మంద బుచ్చయ్య, ఎండీ జాఫర్, అన్నెపు అజయ్, బుల్లె దూడయ్య, బుల్లె సాయిలు, ఎర్రం సతీష్‌కుమార్, కుక్కల శోభ, గుడికందుల సమ్మయ్య, నరహరి, కలకోట యాదగిరి, బెతి నర్సింహారెడ్డి తదితరులు ఎన్నికైన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా జువారి రమేశ్ మాట్లాడుతూ మరోసారి పార్టీ మండల కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సంతాపం

పాలకుర్తి: మండలంలోని లక్ష్మీనారాయణపురం బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు పోగు ఆంజనేయులు, వాసుదేవ్ తల్లి సోమక్క మృతి చెందింది. కాగా, సోమవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా సుదర్శన హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

చిల్పూరు: బుగులు వేంకటేశ్వస్వామి ఆలయంలో సోమవారం శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ వైభవంగా సుదర్శన హోమం, మాస కల్యాణం నిర్వహించారు. అనంతరం ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావుల ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన చిలుపూరి రవీందర్‌రెడ్డి–సరిత, పేరి లక్ష్మణ్‌రావు–ప్రభావతి దేవిలు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ మోహన్, వీరన్న, ధర్మకర్తలు మోతె మహేష్, గనగోని రమేష్, బుచ్చయ్య పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలి



ఉపాధి పనుల వద్ద బడిబాట ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

జఫర్‌గఢ్: పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించి వారి విద్యాభివృద్ధికి తోడ్పడాలని తల్లిదండ్రులను మండలంలోని కూనూర్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు కోరారు. సోమవారం బడిబాటలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం చేయడంతో పాటు ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడి పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని అభ్యర్థించారు. హెచ్‌ఎం ఎండీ పర్వేజ్, కాసర్ల సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సోమయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పలువురికి దళితరత్న అవార్డులు

కొడకండ్ల/బచ్చన్నపేట/లింగాలఘణపురం: జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన పలువురు దళితరత్న అవార్డులను డాక్టర్ అంబేడ్కర్ రాష్ట్ర ఉత్సవ కమిటీ రాష్ట్ర చైర్మన్ ఇటుక రాజన్న, కరెన్సీపై అంబేడ్కర్ ఫొటోసాధన సమితి జాతీయ అధ్యక్షుడు జెరిపోతుల పరశురాములు, మాదిగ మహిళా సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షురాలు మేరి చేతుల మీదుగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. అవార్డు అందుకున్న వారిలో కొడకండ్ల మండలం రామవరం గ్రామానికి చెందిన ఎడెల్లి సన్నీ, బచ్చన్నపేట మండలం పోచన్నపేటకు చెందిన న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు దత్రపు నరేష్‌కుమార్, లింగాలఘణపురం మండల కేంద్రానికి చెందిన గాయకుడు కవి గట్టగల్ల సంజీవలు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సేవ, కృషికి గుర్తింపునిచ్చి అవార్డును అందించడం ఆనందంగా ఉందని, దళితుల అభ్యున్నతే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

‘సీఎంఆర్‌ఎఫ్’ల మంజూరుపై పీఎస్‌లో ఫిర్యాదు



బాధితుడితో కలిసి పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న శివరాజ్ యాదవ్

జనగామ: సీఎంఆర్ రిలీఫ్ ఫండ్ చెక్కుల విషయమై నాగపురి కిరణ్ కుమార్‌గౌడ్, నూకల బాల్‌రెడ్డిపై బాధితుడు సోమవారం జనగామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ట్లు ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన సాగర్ అనే వ్యక్తి తన బంధువులకు సంబంధించిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు విషయంలో గతంలో డీసీసీ కార్యాయలంలో అప్లికేషన్ ఇవ్వగా, ఆన్‌లైన్ చేయగా మెసేజ్ సైతం వారికి వెళ్లిందన్నారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కు ఇచ్చే క్రమంలో కొంతమేర ఖర్చు అవుతుందని బాధిత కుటుంబాన్ని బాల్‌రెడ్డి మోసం చేసే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. జనగామలో సోమవారం నాగపురి కిరణ్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో చెక్కులు పంపిణీ చేస్తున్నామని, డబ్బులు పట్టుకుని రావాలని బాల్‌రెడ్డి మరోసారి ఫోన్ చేసినట్లు చెప్పగా, ఈ మేరకు బాధితుడు పోలీస్టేషన్‌లో సీఐకి పిర్యాదు చేసి, తనకు చెక్కు ఇప్పించాలని కోరడం జరిగిందన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శం



స్టేషన్‌ఘన్‌పూర్: సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



బచ్చన్నపేటలో..

జనగామ రూరల్/స్టేషన్‌ఘన్‌పూర్/రఘునాథపల్లి/పాలకుర్తి/జఫర్‌గఢ్: కమ్యూనిస్టుగా నిరాడంబర జీవితాన్ని గడిపిన అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య జీవితం అన్ని వర్గాల వారికి ఆదర్శనీయమని సీపీఎం నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంతోపాటు పలు మండలాల్లో సీపీఎం ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పుచ్చలపల్లి జీవితం కేవలం కమ్యూనిస్టులకే కాకుండా అన్ని వర్గాల వారికి ఆదర్శనీయమని, నేటి యువత ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, నాయకులు జోగు ప్రకాశ్, సాంబరాజు యాదగిరి, గోపి, మునిగెల రమేష్, గంగాపురం మహేందర్, చిట్యాల సోమన్న, , మాచర్ల సారయ్య, రాపర్తి సోమయ్య, చిలుముల భాస్కర్, కత్తుల రాజు, సుంచు విజేందర్, గోపగోని వెంకటేశ్వర్లు, మేకల యాదగిరి, గుండెబోయిన రాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండీ షబానా, రాపర్తి రజిత, లక్ష్మి తదితరులు ఉన్నారు.

బోనమెత్తిన ఎమ్మెల్యే యశస్విని



పాలకుర్తి: ముదిరాజుల ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం వల్మిడి గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు బోనాలను ఎత్తుకుని గ్రామ ప్రజలను ఆకట్టుకున్నారు. వల్మిడి గ్రామాన్ని పర్యాటక రంగంగా అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ముదిరాజ్ మహాసభ నాయకుడు నీరటి చంద్రయ్య, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

పాలకుర్తి టౌన్: బమ్మెర గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా నియోజవర్గ కోఆర్డినేటర్ జోగు కృష్ణ సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజవర్గ వర్గ అభివృద్ధి చూసి యువత కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి,నాయకులు మేడారపు సుధాకర్, సునీల్ పాల్గొన్నారు.

లారీని దొంగిలించిన డ్రైవర్ అరెస్ట్



లారీ డ్రైవర్ అరెస్టును చూపిస్తున్న సీఐ, పీఎస్సై

పాలకుర్తి టౌన్: లారీని దొంగిలించిన డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం సీఐ కార్యాలయంలో లారీ డ్రైవర్ విశాల్ కుమార్‌ను అరెస్టు చేసిన అనంతరం విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. మిర్యాలగూడకు చెందిన రమావత్ హరికి చెందిన లారీకి బీహార్ రాష్ట్రానికి చెందిన విశాల్‌కుమార్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మండలంలోని దర్దేపల్లి గ్రామంలో రైస్ మిల్లు వద్ద ఏప్రిల్ 1వ తేదీన ఉనుక కోసం లారీని తీసుకు వచ్చిన విశాల్ కుమార్ మద్యం మత్తులో లారీ యాజమాని రమావత్ హరికి ఫోన్ చేసి అదనంగా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లారీని తీసుకురమ్మని యాజమాని డ్రైవర్‌ను అదేశించినప్పటికీ మిర్యాలగూడకు తీసుకు వెళ్లకుండా లారీని దొంగిలించి సంగారెడ్డిలో వదిలేసి వెళ్లాడు. కాగా, పాలకుర్తి పోలీసులు లారీని పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సీజ్ చేశారు. గత రెండు రోజుల క్రితం లారీని దొంగిలిచిన డ్రైవర్ విశాల్‌కుమార్ సంగారెడ్డిలో తాను వదిలేసిన ప్రదేశంలో లారీ లేకపోవడంతో లారీ ఆచూకి కోసం దర్దేపల్లి లోని రైస్ మిల్లు వద్దకు వచ్చాడు. దీంతో డ్రైవర్‌ను పోలీసు అరెస్టు చేయగా 14 రోజుల రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. లారీ డ్రైవర్‌ను పట్టుకునేందుకు కృషి చేసిన ఎస్సై దూలం పవన్‌కుమార్, పీఎస్సై రాజేష్‌లతోపాటు అసిస్టెంట్ అనాల్సిస్ ఆఫీసర్ సల్మాన్‌షాష, కానిస్టేబుల్ రమేష్, సురేష్, మనోజ్, రమేష్, రాజ్‌మార్, రవిలను సీఐ అభినందించారు.

బైండోవర్ ఉల్లంఘన కేసులో ఇద్దరికి జైలు

చిల్పూరు: తహసీల్దార్ ఎదుట ఇద్దరిని బైండోవర్ చేసినప్పటికీ నిబంధనలు ఉల్లంఘించి నాటుసార తయారు చేసి అమ్ముతుండగా కేసు నమోదు చేసి ఇద్దరిని సోమవారం చర్లపల్లి జైలుకు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ భూపేశ్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ జీపీ పరిధిలోని ఎర్రకుంటతండాకు చెందిన గుగులోత్ నరేష్, యాపల్‌బోల్‌తండాకు చెందిన భూక్య రాజు లు నాటుసార తయారి, విక్రయిస్తుండగా ఇటీవల పట్టుపడటంతో వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మళ్లీ నాటుసారా తయారి చేసి ఇతర గ్రామాలకు సరఫరా చేస్తుండటంతో పట్టుకు ని తహసీల్దార్ సరస్వతి ఎదుట హాజరుపర్చాగా బైండోవర్ ఉల్లంఘించినందున రూ.లక్ష జరిమాన లేదా 6 నెలలు జైలు శిక్ష విధించారు. రూ. లక్ష చెల్లించలేమని తెలుపడంతో వారిని చర్లపల్లి జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్సై నరేష్, హెచ్‌సీ యాకూబ్, సిబ్బంది శ్రీనివాస్, దస్తగిరి, సలీంలు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



చిల్పూరు: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించనున్నట్లు ఇండియన్ బ్యాంకు మేనేజర్ రాజు తెలిపారు. మల్కాపూర్ గ్రామంలో ఇండియన్ బ్యాంకులో సోమవారం బ్యాంకు వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ కేక్ కట్ చేసి మాట్లాడారు. అసిస్టెంట్ మేనేజర్ శివకుమార్, క్యాషియర్ శ్రీనాథ్, గంగాధర్, విశ్రుత, వాసుదేవరెడ్డి, విరాట్, బ్రహ్మచారి, సుబాష్, రజియ పాల్గొన్నారు.

కొండగట్టుకు పాదయాత్రగా తరలిన హనుమాన్ మాలధారులు



తరిగొప్పుల/బచ్చన్నపేట: బచ్చన్నపేట మండలం, తరిగొప్పుల మండలంలోని అబ్దుల్‌నాగారం గ్రామానికి చెందిన హనుమాన్ మాలధారణ భక్తులు సోమవారం కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. గురుస్వామి మూల నాగరాజు మాట్లాడుతూ హనుమాన్ మాలధారణ భక్తులు 102 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి కాలినడకన మూడురోజుల్లో చేసుకొని మాల వితరణ చేయనున్నట్లు తెలిపారు. భక్తులు భాసబోయిన రాజు,నవీన్‌కుమార్, మూల మహేష్, పరుశరాములు, కనకరత్నం,శ్రీకాంత్,జగదీష్, ప్రశాంత్, కనకయ్య, అజయ్, సాయి పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఆకాంక్షల కోసం పోరాటం

దేవరుప్పుల: ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పాటుపడిన ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చేందుకు పోరాటమే ఏకైక మార్గమని ఎమ్మెల్సీ, తెలంగాణ సాధన ఉద్యమకారుడు ప్రొఫెసర్ కోదండ రామ్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఈ నెల 25వ తేదీన పాలకుర్తిలో తలపెట్టిన చలో పాలకుర్తి కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉద్యమకారుల ఆకాంక్ష వేదిక రాష్ట్ర ఇన్‌చార్జ్ గోధుమల కుమారస్వామి, నియోజకవర్గ కన్వీనర్ పులిగిల్ల యాకయ్య, దేవరుప్పుల మండల అధ్యక్షుడు కత్తుల సుధాకర్, ప్రజా సంఘ నాయకులు పాల్గొన్నారు.